# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 28-05-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ఆధునిక సవాళ్లను సమర్ధవంతంగా ఎదుర్కోవాలంటే పోలీసు వ్యవస్థ బలోపేతం కావాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.
- దేశంలోని ప్రతి అక్రమ వలసదారుడిని గుర్తించి వారిని బయటికి పంపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు.
- పరీక్షల్లో మరింత పారదర్శకతను నిర్ధారించే లక్ష్యంతోనే సీబీఎస్ఈ ఆన్-స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) విధానాన్ని తీసుకువచ్చిందని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు.
- కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేశారు.
- దేశంలో కష్టపడి పనిచేసే రైతుల అవిశ్రాంత కృషి కారణంగా పుష్కలమైన ఆహార నిల్వలు ఉన్నాయని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు.

====================

ఆధునిక సవాళ్లను సమర్ధవంతంగా ఎదుర్కోవాలంటే పోలీసు వ్యవస్థ బలోపేతం కావాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. సిక్కిం పర్యటనలో భాగంగా.. గాంగ్‌టక్‌లోని పాల్జోర్ స్టేడియంలో ఆ రాష్ట్ర పోలీస్ విభాగానికి ప్రతిష్టాత్మకమైన `ప్రెసిడెంట్స్ పోలీస్ కలర్`ను రాష్ట్రపతి ఈరోజు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ద్రౌపది ముర్ము మాట్లాడుతూ... పోలీసింగ్ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం అత్యంత ఆవశ్యకమని చెప్పారు. సామాన్య ప్రజలు నిర్భయంగా తమ ఫిర్యాదులను నమోదు చేసుకోగలిగేలా పోలీసు యంత్రాంగాన్ని మరింత స్నేహపూర్వకంగా మార్చాలని పేర్కొన్నారు. మహిళలు, పిల్లలు సమాజంలోని బలహీన వర్గాల పట్ల సున్నితమైన వైఖరిని అవలంబించడానికి పోలీసులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భారతదేశ పోలీసు వ్యవస్థపై సుదీర్ఘ వలస పాలన ముద్ర ఉందని, ఆ కాలంలో పోలీసుల ప్రాథమిక లక్ష్యం ప్రజలకు సేవ చేయడం కాదని వారిని నియంత్రించడం, పాలక ప్రభుత్వం ఆదేశాలను కఠినంగా అమలు చేయడమేనన్నారు. దేశ పౌరులకు సాధికారత కల్పించాలంటే.. ఈ వలసవాద దృక్పథాన్ని పూర్తిగా విడనాడాలన్నారు.

====================

దేశంలోని ప్రతి అక్రమ వలసదారుడిని గుర్తించి వారిని బయటికి పంపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. గాంధీనగర్ లోక్‌సభ నియోజకవర్గంలో 340 కోట్ల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు ఆయన ఈరోజు ప్రారంభాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ... సరిహద్దులను పటిష్టం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. వారం రోజుల్లోనే సరిహద్దు భద్రతా దళానికి 600 హెక్టార్ల భూమిని వేగంగా కేటాయించినందుకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని హోం మంత్రి ఈ సందర్భంగా అభినందిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

పరీక్షల్లో మరింత పారదర్శకతను నిర్ధారించే లక్ష్యంతోనే సీబీఎస్ఈ ఆన్-స్కీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) విధానాన్ని తీసుకువచ్చిందని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. సీబీఎస్ఈ అధికారులతో న్యూఢిల్లీలో ఈరోజు సమావేశం నిర్వహించిన అనంతరం ధర్మేంద్ర ప్రధాన్ పాత్రికేయులతో మాట్లాడారు. సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షల ఓఎస్ఎం వ్యవస్థలోని వ్యత్యాసాలు, పునః మూల్యాంకన పోర్టల్‌లోని సాంకేతిక లోపాలపై వ్యక్తమైన ఆందోళనలను ఉద్దేశించి ఆయన విలేకరులతో మాట్లాడుతూ... మూల్యాంకనంలో కొన్ని సమస్యలు తలెత్తాయని అంగీకరించారు. కొనసాగుతున్న పునః మూల్యాంకన ప్రక్రియలో విద్యార్థుల ఫిర్యాదులన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దేశంలోని అనేక విశ్వవిద్యాలయాలు, సంస్థలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా పలు సంస్థలు ఓఎస్ఎం వ్యవస్థ వైపు అడుగులు వేస్తున్నాయని చెప్పారు. సీబీఎస్ఈ  ఈ వ్యవస్థను అమలు చేయడం ఇదే మొదటిసారి అని, ఓఎస్ఎం ప్రక్రియ ద్వారా దాదాపు 40 కోట్ల స్కాన్ చేసిన పేజీలను తొలిసారిగా మూల్యాంకనం చేశారని ఆయన తెలిపారు. ఓఎస్ఎం వ్యవస్థ ద్వారా విద్యార్థులు తమ మార్కుల వివరాలను పారదర్శకంగా పొందవచ్చని, అలాగే తమ జవాబు పత్రాల స్కాన్ చేసిన కాపీలను నేరుగా చూసుకోవచ్చని ధర్మేంద్ర ప్రధాన్ వివరిస్తూ..

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో కష్టపడి పనిచేసే రైతుల అవిశ్రాంత కృషి కారణంగా పుష్కలమైన ఆహార నిల్వలు ఉన్నాయని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని పూసా కాంప్లెక్స్‌లో ఖరీఫ్ కాన్ క్లేవ్-2026పై ఆయన ఈరోజు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో ఆహార భద్రతను నిర్ధారించడం, రైతుల జీవనోపాధిని మెరుగుపరచడం, దేశ ప్రజలకు పౌష్టికరమైన ఆహారాన్ని అందించడం ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని ఈ సందర్భంగా చెప్పారు. వరి ఉత్పత్తిలో భారత్.. చైనాను అధిగమించి ప్రపంచంలోనే అగ్ర స్థానానికి చేరిందన్నారు. ఆహార ధాన్యాల ఉత్పత్తి 3 వేల 765 లక్షల టన్నులు దాటిందని.. ఇది ఒక చారిత్రాత్మక విజయమన్నారు. వాతావరణ మార్పుల నుండి డిజిటల్ వ్యవసాయం వరకు, ఖరీఫ్ సదస్సులో ఒక కొత్త వ్యవసాయ కార్యాచరణను రూపొందిస్తామని శివరాజ్ సింగ్ చౌహాన్ వివరిస్తూ..

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పదవికి ఈరోజు రాజీనామా చేశారు. ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి డి.కె. శివ కుమార్‌తో కలిసి లోక్‌భవన్‌కు వెళ్లిన సిద్ధరామయ్య తన రాజీనామాను సమర్పించారు. ప్రస్తుతం గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ బెంగళూరులో లేనందున గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి ప్రభు శంకర్ రాజీనామా పత్రాన్ని స్వీకరించారు. అనంతరం పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసిన సిద్ధరామయ్య కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు తాను రాజీనామా

చేసినట్లు ప్రకటించారు. గవర్నర్ బెంగళూరు తిరిగి వచ్చిన తర్వాత రాజీనామాపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. జాతీయ రాజకీయాలపై తనకు ఆసక్తి లేదని ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసినప్పటికీ రాష్ట్ర ప్రజల కోసం పని చేయడం కొనసాగిస్తానని చెప్పారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో, సిద్ధరామయ్య రెండోసారి కర్ణాటక ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన గతంలో 2013 నుంచి 2018 వరకు ముఖ్యమంత్రిగా పని చేశారు. రెండు పర్యాయాలలో ఎనిమిదేళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసి, రాష్ట్రంలో అత్యధిక కాలం పనిచేసిన ముఖ్యమంత్రిగా ఆయన ఘనత సాధించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశ పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనలో బొగ్గు గ్యాసిఫికేషన్ ఒక ప్రధానమైన మైలురాయిగా ఎదుగుతోందని ఆ శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సర్ఫేస్ కోల్, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల ప్రోత్సాహక పథకంపై న్యూఢిల్లీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన ఈరోజు ప్రసంగించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా.. ఇంధన రంగంలో స్వయం సమృద్ధి, భద్రత వైపు స్థిరంగా అడుగులు వేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. బొగ్గు వాయువు ఉత్పత్తి కేవలం ఒక ఇంధన కార్యక్రమం మాత్రమే కాదని, ఇది భారతదేశం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి, స్వచ్ఛమైన బొగ్గు వినియోగాన్ని ప్రోత్సహించడానికి, అలాగే ఎరువులు, పెట్రోకెమికల్స్, మిథనాల్, హైడ్రోజన్, అధునాతన తయారీ వంటి అనుబంధ పరిశ్రమలలో కొత్త అవకాశాలను సృష్టించడానికి సహాయపడుతుందని కిషన్ రెడ్డి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

తెలంగాణలోని హనుమకొండ జిల్లా కాజీపేటలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న రైల్ కోచ్ ఫ్యాక్టరీ పనులు చివరి దశకు చేరుకున్నాయని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. రైల్వే శాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్ బిట్టు, సీనియర్ అధికారులతో కలిసి కాజీపేట రైలు తయారీ యూనిట్‌ను కార్యాచరణలోకి తీసుకువచ్చే ప్రణాళికలపై ఆయన ఈరోజు న్యూఢిల్లీలో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన కాజీపేట రైల్వే యూనిట్‌లో త్వరలోనే సరికొత్త ఇంటర్ సిటీ రైళ్ల తయారీ ప్రారంభం కానుందని స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = =